సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 4 । ఏప్రిల్ । 2025



బడుల్లో తాగునీటి తండ్లాట

ప్రభుత్వ పాఠశాలల్లో నీటి కష్టాలు తొలగడం లేదు. విద్యార్థులు దాహార్తి తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸



కారులో నిద్రిస్తున్న వారిపై దాడి

టేక్రియాల్ రోడ్డు పక్కన కారు నిలిపి విశ్రాంతి తీసుకుంటున్న వారిపై దుండగులు దాడి చేసి దోపిడీకి పాల్పడ్డారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
37.6 /23.4

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ మోస్తరు నుంచి తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఈవీఎం గోడౌన్‌ను సందర్శించిన కలెక్టర్



ఈవీఎం గోడౌన్ వద్ద కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో గల ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం సందర్శించారు. గోడౌన్‌కు వేసిన సీళ్లు, పోలీసు బందోబస్తును పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు ఉన్నారు.

భీమ్‌గల్ ఏడీఏ సరెండర్

డొంకేశ్వర్(ఆర్మూర్): భీమ్‌గల్ డివిజన్ వ్యవసాయ అధికారి (ఏడీఏ) శ్రీనివాస్ రాజును రాష్ట్ర శాఖకు సరెండర్ చేశారు. ఆయన బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి విధులు సరిగా నిర్వర్తించడం లేదనే కారణంతో సరెండర్ చేసినట్లు తెలిసింది. కార్యాలయానికి రాకుండా విధులను నిర్లక్ష్యం చేయడంతో కమిషనర్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఇటీవల ఆ శాఖ డైరెక్టర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. కాగా, ముప్కాల్ ఏవో సాయికృష్ణకు భీమ్‌గల్ ఏడీఏగా ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు.

ఐసీడీఎస్‌లో ‘ఆకాశరామన్న’ అలజడి

- కలకలం రేపిన ఉత్తరం
- అక్రమ నియామకాలు, ఇష్టారాజ్యంగా బదిలీలు
- పిల్లల దత్తత విషయంలో ముడుపులపై ఆరోపణలు
- పలుమార్లు విచారణ.. చర్యలు శూన్యం

నిజామాబాద్ నాగారం: మహిళా, శిశు, దివ్యాంగ, వయోవృద్ధుల శాఖ (ఐసీడీఎస్)లో ఆకాశరామన్న ఉత్తరం అలజడి సృష్టిస్తోంది. అక్రమ నియామకాలు, ఇష్టారాజ్యంగా బదిలీలు, పిల్లల దత్తత విషయంలో ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు మాయని మచ్చ తెచ్చిపెడుతున్నాయి. స్వధార్‌హోంతోపాటు ఇతర అంశాలపై పలుమార్లు రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడం చర్చనీయాంశమైంది. ఇదే శాఖలో గతంలో జరిగిన అక్రమ బదిలీలు, స్వధార్‌హోంపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు విచారణ జరిగినా ఇప్పటి వరకు నివేదికలు బయటికి రాలేదు. ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. తాజాగా ఆకాశరామన్న ఉత్తరం నేపథ్యంలో బుధ, గురువారాల్లో డీఎంహెచ్‌వో, డీఎండబ్ల్యూవో చాంబర్లలో అధికారులు విచారణ చేపట్టడం కలకలం రేపింది. 2011లో 1098 చైల్డ్‌హెల్ప్‌లైన్‌లో చేపట్టిన నియామకాలపై అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. పిల్లల దత్తత వ్యవహారంలో ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలపై ప్రశ్నించినట్లు సమాచారం. ఇష్టారాజ్యంగా అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల బదిలీలు, పదోన్నతులపై ఉద్యోగులపై ప్రశ్నల వర్షం కురిపించినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఐసీడీఎస్ శాఖ అక్రమాలపై గతంలోనూ విచారణ జరిగినా తగిన చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

ఇసుకాసురులదే రాజ్యం

- బోధన్ డివిజన్‌లో పరిమితికి మించి టిప్పర్ల ద్వారా ఇసుక రవాణా
- ఒక్క కూపన్‌తో రెండు నుంచి మూడు ట్రిప్పులు
- రవాణా శాఖ చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తేనే అడ్డుకట్ట
- తమ పరిస్థితి అగమ్యగోచరమైందంటున్న నిజామాబాద్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు
- హైదరాబాద్‌లో గనులశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు
- నిజామాబాద్ రూరల్ మండలంలో పట్టుబడ్డ మూడు టిప్పర్లు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: బోధన్ డివిజన్‌లోని మంజీర పరీవాహకంలో ఇసుక తవ్వకాలు, రవాణా విషయంలో కొందరు అక్రమార్కులు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా తయారైంది. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో అక్రమ ఇసుక రవాణాదారుల ఇష్టారాజ్యం అయింది. ఏకంగా ఇసుక డంపులు ఏర్పాటు చేసుకుని జీరో దందా చేస్తున్నారు. ఇదిలా ఉండగా మరోవైపు నిబంధనల ప్రకారం ప్రభుత్వానికి డీడీ రూపంలో చెల్లింపులు చేసి కాళేశ్వరం నుంచి ఇసుక రవాణా చేస్తున్న తమకు అన్యాయం జరుగుతోందని నిజామాబాద్ లారీ ఓనర్స్ అండ్ బిల్డింగ్ మెటీరియల్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేశారు.

■ బోధన్, ఎడపల్లి, రెంజల్ మండలాల్లో స్థానిక ప్రజల అవసరాలు, వివిధ అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం ఖండ్‌గావ్, సిద్దాపూర్, మందర్నా గ్రామాల వద్ద మంజీర నదిలో ఇసుక తవ్వేందుకు రెవెన్యూ శాఖ ద్వారా అనుమతులిచ్చింది. అయితే ఇసుక తోలకందార్లు ఒక్క కూపన్ మీద రెండు నుంచి మూడు ట్రిప్పులు కొడుతున్నారు. పైగా సమీప ప్రాంతాల్లో డంపులు ఏర్పాటు చేసుకుని జీరో దందా చేస్తున్నారు. రెంజల్ మండలంలోని నీల, పేపర్‌మిల్లు గ్రామాల వద్ద వాగు నుంచి అక్రమంగా ఇసుక తోడేసి, రవాణా చేస్తున్నారు. అదేవిధంగా పరిమితికి మించి ఓవర్ లోడ్‌తో ఇసుక తరలిస్తున్నారు. తహసీల్దారు ఇచ్చిన అనుమతి మేరకు ఇక్కడ నుంచి

■ తాజాగా గురువారం అధిక లోడ్‌తో ఇసుక రవాణా చేస్తున్న మూడు టిప్పర్లను నిజామాబాద్ రూరల్ పోలీసులు పట్టుకున్నారు. అయితే వీటిపై ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ లారీలపై కేసులు కాకుండా, కేవలం మైనింగ్ అధికారుల ద్వారా జరిమానా వేయించి పంపించేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఒకరు లాబీయింగ్ చేసినట్లు తెలుస్తోంది.

ఒక్కో టిప్పర్‌కు 10.5 టన్నులు (7 క్యూబిక్ మీటర్లు) లోడ్ వేయాల్సి ఉంటుంది. అయితే ఏకంగా 21 టన్నులు (14 క్యూబిక్ మీటర్లు)తో టిప్పర్లు వెళుతున్నాయి. రవాణా శాఖ నిబంధనలకు విరుద్ధంగా టిప్పర్ల బాడీని ఎత్తుకు కట్టిస్తున్నారు. రవాణా అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ టిప్పర్ల ద్వారా ఇసుకను నిజామాబాద్, కామారెడ్డి, హైదరాబాద్ లాంటి ప్రాంతాలకు యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు. ఇసుక ర్యాంప్ నిర్వహిస్తున్న చోటనే రవాణా శాఖ చెక్‌పోస్టు ఏర్పాటు చేస్తే ఓవర్ లోడ్ వ్యవహారాన్ని అరికట్టే అవకాశం ఉంది.



నిజామాబాద్ రూరల్ పోలీసులు పట్టుకున్న టిప్పర్లు

అన్యాయం జరుగుతోంది.. చర్యలు తీసుకోండి

ఇసుక అక్రమ దందా చేస్తున్న టిప్పర్ల కారణంగా తమకు అన్యాయం జరుగుతోందంటూ నిజామాబాద్ లారీ ఓనర్స్ అండ్ బిల్డింగ్ మెటీరియల్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు ఎన్ఆర్ రవి, లింగారెడ్డి, నగేశ్,నర్సింహ, మజర్, పటేల్, ఇమ్రాన్, ముఫ్తి గురువారం హైదరాబాద్ వెళ్లి గనులశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేశారు. తెలంగాణ ప్రభుత్వానికి రూ.13,200 డీడీ కట్టి కాళేశ్వరం నుంచి ఇసుక రవాణా చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీని ద్వారా 14 టైర్ల లారీలో వాహన బరువుతో కలిపి 42 టన్నుల ఇసుక రవాణా చేసేందుకు అనుమతి ఉంది. నిజామాబాద్ నుంచి కాళేశ్వరం వెళ్లి వచ్చేందుకు 500 కిలోమీటర్లు ప్రయాణం చేసేందుకు నాలుగు రోజుల సమయం పడుతోందని తెలిపారు. అయితే అక్రమార్కులు



హైదరాబాద్‌లో మాట్లాడుతున్న నిజామాబాద్ లారీ అసోసియేషన్ ప్రతినిధులు

జిల్లా కలెక్టర్‌కు కేవలం రూ.2,500 డీడీ మాత్రమే చెల్లించి బోధన్ ప్రాంతం నుంచి ఆరు టైర్ల టిప్పర్ల ద్వారా అధిక లోడ్‌తో ఇసుక రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. తాము 14 టైర్ల లారీకి 32 టన్నులకు డీడీ కట్టగా 28 టన్నుల ఇసుక మాత్రమే వస్తున్నట్లు పేర్కొన్నారు. కానీ అక్రమార్కులు స్థానికంగా మంజీర నుంచి ఆరు టైర్ల టిప్పర్‌లో 10.5 టన్నులకు డీడీ కట్టి ఏకంగా 21 టన్నుల నుంచి 25 టన్నులు రవాణా చేస్తున్నట్లు వివరించారు. స్థానికంగా ఇసుక రవాణా చేసేందుకు ట్రాక్టర్లకు తప్ప టిప్పర్లకు అనుమతి లేదని, అయినప్పటికీ నిజామాబాద్ జిల్లాలో టిప్పర్లతో ఇసుక రవాణా చేసేందుకు విచ్చలవిడి అనుమతులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ టిప్పర్ల కారణంగా ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా డీడీ కట్టి 14 టైర్లు, 16 టైర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్న తాము నష్టపోతున్నట్లు వివరించారు. నిజామాబాద్ కలెక్టర్, రవాణాశాఖ డీటీసీ, గనులశాఖ ఏడీ, పోలీసు కమిషనర్‌కు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ చర్యలు తీసుకోలేదని గనులశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఇచ్చిన ఫిర్యాదులో అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

- డీఈవో అశోక్



మాట్లాడుతున్న డీఈవో అశోక్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ సూచించారు. నగర శివారులోని బోర్గాం(పీ) జెడ్పీహెచ్‌ఎస్‌లో గురువారం గెజిటెడ్ హెచ్‌ఎంలుగా ప్రమోషన్ పొందిన ప్రధానోపాధ్యాయులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు పాఠశాలలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరిస్తూ, నాణ్యమైన విద్యాబోధన అందించాలని సూచించారు. ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దడంలో హెచ్‌ఎంల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ శంకర్, రీసోర్స్ పర్సన్లు నాగయ్య, ధ్రుపత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్, నరేశ్, స్థానిక హెచ్‌ఎం శంకర్, ప్రమోషన్ పొందిన 75 మంది హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ముగిసిన వొకేషనల్ పరీక్షలు



నిజామాబాద్ అర్బన్: జిల్లాలో పదో తరగతి వొకేషనల్ పరీక్షలు గురువారం ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 2,221 మంది విద్యార్థులకు గాను 2,179 మంది పరీక్షలు రాయగా, 42 మంది గైర్హాజరయ్యారు. దీంతో పదో తరగతి పరీక్షలు పూర్తిస్థాయిలో ముగిశాయి.

నిరంతర విద్యుత్ సరఫరే లక్ష్యం



నగరంలోని పీహెచ్‌సీ పవర్ హౌస్ సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఎస్ఈ రవీందర్

- ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ ఆర్ రవీందర్

సుభాష్‌నగర్: వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే ఎన్‌పీడీసీఎల్ లక్ష్యమని ఎస్ఈ రాపెల్లి రవీందర్ పేర్కొన్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా నగరంలోని 33 కేవీ పీహెచ్‌సీ పవర్ హౌస్ సబ్‌స్టేషన్‌లో 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం బిగించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ కోతలు లేకుండా ఉండేందుకు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 12.5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను బిగిస్తున్నామని తెలిపారు. ఓవర్ లోడ్ ఉన్న సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యుత్ సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబర్ 1912ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీఈలు ఎం శ్రీనివాస్‌రావు, వెంకటరమణ, ఏడీఈలు ఆర్ చంద్రశేఖర్, నటరాజ్, తోట రాజశేఖర్, ఏఈలు జి సాయిలు, బాబా శ్రీనివాస్, నాగేశ్, డీ–1, నాగారం సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

వర్ని : ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. వర్ని మండలంలోని జాకోర, జలాల్‌పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాల నేపథ్యంలో కొనుగోళ్లు వేగవంతం చేసి ధాన్యం తడిసిపోకుండా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించి డిజిటల్ యంత్రం సహాయంతో వడ్ల తేమ శాతాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తరలించేందుకు లారీలను అందుబాటులో ఉంచాలన్నారు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా, మైదాన ప్రాంతాల్లో ధాన్యం ఆరబెట్టేలా చైతన్యపరచాలని సూచించారు.

బోర్డులు ఏర్పాటు చేయాలి

జిల్లాలోని చౌకధరల దుకాణాల్లో రేషన్ కార్డులు, లబ్ధిదారుల సంఖ్య, కేటాయించిన బియ్యం ఇతర స్టాక్ వివరాలను తెలిపే నోటీసు బోర్డులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. జలాల్‌పూర్ గ్రామంలో సన్న బియ్యం పంపిణీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. దుకాణానికి బోర్డు లేకపోవడంతో డీలర్‌పై మండిపడ్డారు. బియ్యం పంపిణీ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, బోధన్ ఆర్డీవో సాయాగౌడ్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సివిల్ సప్లై డీఎం శ్రీకాంత్ రెడ్డి, డీసీవో శ్రీనివాస్, వర్ని తహసీల్దార్ సాయిలు, ఎంపీడీవో వెంకటేశ్ పాల్గొన్నారు.



జాకోరాలో ధాన్యం తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హనుమంతు

కలెక్టర్ కారు ఎదుట బాధితుడి నిరసన

వర్ని: ప్రభుత్వం అందజేసిన స్థలం విషయంలో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించాలని కలెక్టర్ కారు ఎదుట పడుకొని జాకోరా గ్రామానికి చెందిన కురుమే సాగర్ నిరసన తెలిపారు. 2005లో జాకోరా గ్రామంలో ఇంటి స్థలం మంజూరు కాగా, ఆ స్థలంలో నిర్మాణం చేపట్టనివ్వకుండా చుట్టుపక్కల వారు ఇబ్బంది పెడుతున్నారని వివరించారు. ఈ విషయంలో పంచాయతీ కార్యదర్శి సాయిలు, ఎంపీడీవో వెంకటేశ్, తహసీల్దార్ సాయిలుకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని కలెక్టర్‌కు విన్నవించాడు. స్పందించిన కలెక్టర్.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



కలెక్టర్ కారు ముందు పడుకుని నిరసన వ్యక్తం చేస్తున్న బాధితుడు సాగర్



జలాల్‌పూర్ శివారులో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతు



గడ్కోల్‌లో కొట్టుకుపోయిన ధాన్యం



హొన్నాజీపేటలో తడిసిన ధాన్యం

అన్నదాతకు అకాల‘దెబ్బ’

- జిల్లాలో పలుచోట్ల కురిసిన వర్షం
- కల్లాల్లో తడిసిన ధాన్యం

అకాల వర్షం అన్నదాతను అతలాకుతలం చేసింది. చేతికొచ్చిన పంట నీటిపాలయ్యింది. కోతలకు సిద్ధమైన వరిపైరు నేలకొరిగింది. ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. పంటలు దెబ్బతినడంతోపాటు ధాన్యం తడిసిపోవడంతో రైతులు గుండెలుబాదుకుంటున్నారు. సంబంధిత అధికారులు నేడు దెబ్బతిన్న పంటలను పరిశీలించనున్నారు. మరో మూడు రోజులు వర్ష సూచన ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. – సాక్షి నెట్‌వర్క్



జాకోరా కొనుగోలు కేంద్రంలో వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు

ధర్పల్లి: ధర్పల్లి మండలంలోని దుబ్బాక, హొన్నాజీపేట్, సీతాయిపేట్, వాడి, కర్నల్ తండాతోపాటు పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. కల్లాల్లో ఆరబోసిన ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం తడవకుండా పలువురు రైతులు టార్పాలిన్లు కప్పారు.

ఇందల్వాయి: ఇందల్వాయి మండలంలోని గన్నారం, ఇందల్వాయి, చంద్రాయన్‌పల్లి, తిర్మన్‌పల్లి గ్రామాల్లో అధిక వర్షం కురిసింది. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడవడంతోపాటు వర్షపు నీటికి కొట్టుకుపోయింది. దీంతో రైతులు కన్నీరుమున్నీరయ్యారు.

సిరికొండ: సిరికొండ మండల కేంద్రంతోపాటు కొండాపూర్, గడ్కోల్, మెట్టుమర్రి తండా, న్యావనంది, రావుట్ల, కొండూర్ తదితర గ్రామాల్లో అకాల వర్షం కురిసింది. కల్లాల్లో నీరు చేరింది. వర్షపు నీటి ఉధృతికి ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోయింది.

బాల్కొండ: మెండోరా, ముప్కాల్ మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది. దీంతో కల్లాల్లో ఆరబెట్టిన పసుపు తడిసి ముద్దయ్యింది. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం, మక్కలు తడిసిపోయాయి. పది నిమిషాలపాటు వర్షం దంచికొట్టింది.



కొండాపూర్‌లో ధాన్యం కల్లంలో చేరిన వర్షపునీరు

వర్ని: వర్ని మండలంలోని జలాల్‌పూర్, సైదిపూర్, కూనిపూర్ శివారులో వర్షం కురిసింది. రైతులు రోడ్లు, వ్యవసాయ క్షేత్రాల్లో ఆరబెట్టిన వరి ధాన్యం తడిసింది. కొంతమంది రైతులు టార్పాలిన్లు కప్పడంతో నష్టం తప్పింది.



సిరికొండ మండలం గడ్కోల్‌లో తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు

త్వరలో ‘కార్బన్ క్రెడిట్ సర్వే’

- హరితహారం, వన మహోత్సవం మొక్కలపై నిర్వహించనున్న ‘ఉపాధి’ ఉద్యోగులు
- సంరక్షిస్తున్న వారికి పారితోషిక నిధులు!

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో త్వరలో ‘కార్బన్ క్రెడిట్ సర్వే’ను అధికారులు చేపట్టనున్నారు. హరితహారం, వన మహోత్సవం కార్యక్రమాల్లో భాగంగా నాటిన మొక్కల కారణంగా నేలకు, గాలికి ఎంత మేలు జరిగిందో తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. న్యూ ఢిల్లీకి చెందిన ఐవోఆర్‌ఏ అనే ప్రైవేట్ సంస్థ ద్వారా సర్వే చేపట్టనుండగా ఇందులో ఉపాధిహామీ ఉద్యోగులను భాగస్వాములను చేశారు. జిల్లాకు చెందిన ఐదుగురు ఉద్యోగులకు ఇటీవల శిక్షణ కూడా పూర్తయింది. శిక్షణ పొందిన వారు ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఏపీవోలు, ఈసీలు, ప్లాంటేషన్ మేనేజర్, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెల 15వ తేదీలోగా కార్బన్ క్రెడిట్ సర్వేను ప్రారంభించేందుకు గ్రామీణాభివృద్ధి శాఖ కసరత్తు చేస్తోంది.

2022–23 సంవత్సరం నుంచే..

సర్వే చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొన్ని గైడ్‌లైన్స్ ఇచ్చింది. 2022–23 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రస్తుత ఏడాది వరకు జిల్లాలో నాటిన మొక్కలనే సర్వే చేయాలని సూచించింది. ఇందులో పల్లె ప్రకృతి వనాలు, కమ్యూనిటీ ప్లాంటేషన్, పండ్ల తోటలు, పొలం గట్లపై నాటిన మొక్కలు, ప్రభుత్వ ప్రాంగణాలు, అటవీ ప్రాంతాలు ఉన్నాయి. మొక్కలను నాటి వాటిని సంరక్షించిన వివరాలను సేకరించాల్సి ఉంటుంది. మొక్కలు నాటిన ప్రాంతాల్లో జీపీఎస్ ద్వారా తిరిగి ఎన్ని మొక్కలు నాటారు? ఎన్ని రకాల మొక్కలున్నాయి? వాటి వయసెంత? వీటి కారణంగా కార్బన్ అణువులు భూమిలో, గాలిలో ఎంత శాతం కలిశాయో రికార్డు చేస్తారు.



డొంకేశ్వర్ మండలం మారంపల్లిలో బ్లాక్ ప్లాంటేషన్ చేస్తున్న అధికారులు (ఫైల్)

మూడేళ్లలో 40లక్షల మొక్కలు

గ్రామీణాభివృద్ధి శాఖ గత మూడేళ్లలో 120 రకాల మొక్కలను 40లక్షల వరకు నాటగా అందులో దాదాపు 60 శాతం మొక్కలు బ్రతికే అవకాశాలున్నాయి. వీటికి మాత్రమే సర్వే నిర్వహిస్తారు. సర్వే వివరాలు యాప్ ద్వారా ఐవోఆర్ఏ సంస్థకు చేరుతాయి. సర్వేపై థర్డ్ పార్టీ ఎంక్వైరీ సైతం చేయనుంది. ఆ తర్వాత మొక్కలు నాటి సంరక్షిస్తున్న యజమానులు, రైతులు, గ్రామ పంచాయతీలకు పారితోషిక నిధులు అందజేసే అవకాశాలున్నాయని డీఆర్‌డీవో సాయాగౌడ్ ‘సాక్షి’కి తెలిపారు.

క్లుప్తంగా

శిలాఫలకం ధ్వంసం


కొనసాగుతున్న శిలాఫలక నిర్మాణ పనులు

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం తిర్మన్‌పల్లిలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి ప్రారంభించబోయే 33/11 కేవీ సబ్ స్టేషన్ శిలాఫలకాన్ని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. స్థానికుల సమాచారం మేరకు సీఐ మల్లేశ్, ఎస్సై మనోజ్ ఘటన స్థలానికి చేరుకొని సంబంధిత అధికారులతో కలిసి మరో శిలాఫలకం ఏర్పాటు పనులు చేయిస్తున్నారు. నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

ఎలుగుబంటి దాడిలో గాయపడిన వ్యక్తికి పరిహారం


చెక్కును అందజేస్తున్న అధికారులు

డొంకేశ్వర్: ఎలుగుబంటి దాడిలో గాయపడిన వ్యక్తికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం మంజూరైంది. ఎడపల్లి మండలం కుర్నాపల్లికి చెందిన పరిగె అశ్విత్ కుమార్‌పై మూడు నెలల క్రితం ఎలుగుబంటి దాడి చేసింది. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10వేల పరిహారాన్ని గురువారం ఎఫ్ఆర్వో సంజయ్‌గౌడ్ బాధిత వ్యక్తికి చెక్కు రూపంలో అందజేశారు.

ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించాలి


మాట్లాడుతున్న వీసీ యాదగిరిరావు

తెయూ(డిచ్‌పల్లి): విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధిస్తే ఎక్కడైనా రాణిస్తారని తెయూ వీసీ టి యాదగిరి రావు అన్నారు. తెయూలో ఇంగ్లిష్ విభాగం ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రెనింగ్ ప్రోగ్రాంను గురువారం వీసీ ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, డీన్ కె లావణ్య, అధ్యాపకులు సమత, స్వామి, జ్యోత్స్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు బార్‌లకు దరఖాస్తుల ఆహ్వానం

ఖలీల్‌వాడి: జిల్లాలో నాలుగు బార్‌లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మూడు, ఆర్మూర్ మున్సిపాలిటీలో ఒక బార్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు ఫారం, రూ. లక్ష డీడీ లేదా చాలాన్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఆధార్, పాన్‌కార్డు పత్రాలతో జిల్లా కేంద్రంలోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. ఈ నెల 26 సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని, 29న ఉదయం 11 గంటలకు కలెక్టర్ చేతుల మీదుగా డ్రా తీస్తామని తెలిపారు.

బడుల్లో తాగునీటి తండ్లాట

ఎన్నాళ్లు.. ఈ కన్నీళ్లు

- నగానికిపైగా పాఠశాలల్లో మంచినీటి సౌకర్యం కరువు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు
- ఇంటి నుంచి నీళ్లు తెచ్చుకుంటున్న పిల్లలు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

ప్రభుత్వ పాఠశాలల్లో నీటి కష్టాలు తొలగడం లేదు. శుద్ధమైన నీరు అందడం లేదు. దీంతో విద్యార్థులు దాహార్తి తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు ముదురుతుండడంతో తాగునీటి కోసం పిల్లలు తండ్లాడుతున్నారు.


నడిపల్లి పాఠశాలలో ఇంటి నుంచి బాటిళ్లలో తెచ్చుకున్న నీటితో మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థులు

డిచ్‌పల్లి: 'ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనంఅందిస్తున్నాం. పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని వారానికి మూడు గుడ్లు పెడుతున్నాం. సౌకర్యాలు కల్పిస్తున్నాం' అంటూ అటు ప్రజాప్రతినిధులు, ఇటు అధికారులు చెబుతూనే ఉన్నారు. ఇతర సౌకర్యాలను అటుంచితే తాగడానికి నీరు అందుబాటులో లేని పరిస్థితి నెలకొంది. జిల్లాలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం లేక పిల్లలు అవస్థలు పడుతున్నారు. వేసవికాలం నేపథ్యంలో సగానికి పైగా ప్రభుత్వ పాఠశాలల్లో మిషన్ భగీరథ నీరు రావడం లేదు.

బాటిల్ నీళ్లే దిక్కు..

జిల్లాలో ప్రస్తుతం 1,171 ప్రభుత్వ పాఠశాలల్లో 1.01 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలకు శుద్ధి నీటిని అందించాలనే లక్ష్యంతో రూ.40 వేల వ్యయంతో ఎంపిక చేసిన 150 పాఠశాలలకు యంత్రాలను అందజేశారు. కానీ, పర్యవేక్షణ లోపంతో అవి తొందరగానే మూలనపడ్డాయి. ప్రధానంగా వాటి మరమ్మతులు మరువడంతో రూ.లక్షలు వృథా అవ్వడంతోపాటు విద్యార్థులకు తాగునీరు అందకుండా పోయింది. ఒక్కో స్కూల్‌కు రూ.2.50 లక్షల వ్యయంతో 416 ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు – మన బడి కింద శుద్ధి నీటి (ఆర్వో) ప్లాంట్ ఏర్పాటు చేసినా చాలా చోట్ల ఇంతవరకు పనులు పూర్తికాక ప్రారంభించలేదు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా చాలా పాఠశాలల్లో ఇప్పటి వరకు నల్లాలు కూడా బిగించలేని పరిస్థితి నెలకొంది. పైప్‌లైన్ వేసిన పాఠశాలల్లో తాగునీరు రావడం లేదు. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో గ్రామీణ ప్రాంతాల్లోని చాలా పాఠశాలల విద్యార్థులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక ఇంటి నుంచే బాటిళ్లలో తెచ్చుకుంటున్నారు. బాటిల్ నీళ్లు సరిపోకపోవడంతో దప్పికతో అవస్థలు పడుతున్నారు.

తాగునీరు ఎంతో అవసరం

మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు నీళ్లు ఎంతో దోహదపడతాయని వైద్యులు చెబుతుంటారు. మానవ శరీరంలో నీటి శాతం అధికంగా ఉంటుంది. విద్యార్థుల విషయానికొస్తే రోజులో ఇంట్లో కంటే ఎక్కువ సమయాన్ని పాఠశాలల్లో గడుపుతుంటారు. కానీ, నీటిని తాగడంలో ఇబ్బందులు పడుతున్నారు. విరామ సమయంలో తప్పితే వేరే సమయంలో నీరు తాగే వారు తక్కువగా ఉంటున్నారు. అసలే వేసవి కాలం ఆపై దప్పిక ఎక్కువ. ఈ సమయంలో మంచి నీళ్లు అందుబాటులో లేకపోతే విద్యార్థులు అనారోగ్య సమస్యల బారినపడే ప్రమాదం పొంచి ఉన్నది. ఇకనైనా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు తాగునీటిని అందుబాటులో ఉంచి నీటి గంటను అమలుపరిస్తే విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటూ చదువుపై శ్రద్ధ చూపుతారని తల్లిదండ్రులు, విద్యావేత్తలు కోరుతున్నారు.

మారిన వ్యవసాయ అధికారుల ఫోన్ నంబర్లు

డొంకేశ్వర్: జిల్లాలో పని చేస్తున్న వ్యవసాయ అధికారుల ఫోన్ నంబర్లు మారాయి. ఇది వరకు ఉన్న పాత నంబర్లను రద్దు చేసిన ప్రభుత్వం కొత్త నంబర్లను కేటాయించింది. ఈ మేరకు జిల్లా వ్యవసాయాధికారితో పాటు ఏడీఏలు, మండల వ్యవసాయాధికారులకు సిమ్ కార్డులను అందజేశారు. ఇవి గురువారం నుంచి అమల్లోకి వచ్చినట్లు డీఏవో వాజిద్ హుస్సేన్ తెలిపారు.

జిల్లా వ్యవసాయాధికారి	8977751940
ఏడీఏ, ఆర్మూర్	8977751979
ఏడీఏ, భీమ్‌గల్	8977751980
ఏడీఏ, బోధన్	8977752259
ఏడీఏ, నిజామాబాద్‌రూరల్	8977752260
ఏడీఏ, నిజామాబాద్ అర్బన్	8977752261

మండల వ్యవసాయాధికారులు

ఆలూరు	8977752269	మోర్తాడ్	8977752385	డిచ్‌పల్లి	8977752425
ఆర్మూర్	8977752270	ముప్కాల్	8977752386	ఇందల్వాయి	8977752445
డొంకేశ్వర్	8977752276	వేల్పూర్	8977752405	జక్రాన్‌పల్లి	8977752446
మాక్లూర్	8977752278	ఏర్గట్ల	8977752406	మోపాల్	8977752447
నందిపేట్	8977752279	బోధన్	8977752407	నిజామాబాద్‌రూరల్	8977752448
బాల్కొండ	8977752280	నవీపేట్	8977752408	సిరికొండ	8977752449
భీమ్‌గల్	8977752382	రెంజల్	8977752409	నిజామాబాద్‌అర్బన్	8977752450
కమ్మర్‌పల్లి	8977752383	సాలూరా	8977752410	కోటగిరి	8977752547
మెండోరా	8977752384	ఎడపల్లి	8977752422	పొతంగల్	8977752548
		ధర్పల్లి	8977752423	రుద్రూర్	8977752549
				వర్ని	8977752550

జీపీవోల నియామకానికి దరఖాస్తుల స్వీకరణ

- మాజీ వీఆర్‌వో, వీఆర్‌ఏలకు అవకాశం

నిజామాబాద్‌అర్బన్: గ్రామ పాలనాధికారులుగా పని చేయడానికి ఆసక్తి కలిగిన మాజీ వీఆర్‌వోలు/వీఆర్‌ఏలు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు ఈ నెల 16 లోపు గూగుల్ ఫామ్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్వయంగా సంతకం చేసిన కాపీని కలెక్టర్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు https://ccla.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

వర్సిటీలో టీచింగ్, నాన్‌టీచింగ్ వాలీబాల్ పోటీ


పోటీలో పాల్గొన్న సభ్యులతో వీసీ, రిజిస్ట్రార్

తెయూ: తెలంగాణ యూనివర్సిటీ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని టీచింగ్, నాన్-టీచింగ్ సిబ్బంది కలిసి రెండు జట్లుగా గురువారం వాలీబాల్ పోటీల్లో తలపడ్డారు. వీసీ టి యాదగిరి రావు నేతృత్వంలో ఏ టీం, రిజిస్ట్రార్ ఎం యాదగిరి నేతృత్వంలో బీ టీంగా ఏర్పడి పోటీల్లో హోరాహోరిగా తలపడ్డారు. పోటీల్లో వీసీ జట్టు విజేతగా నిలిచింది. వాలీబాల్ పోటీల్లో వర్సిటీ ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, స్పోర్ట్స్ డైరెక్టర్ జి బాలకిషన్, పీఆర్వో పున్నయ్య, అధ్యాపకులు పాత నాగరాజు, కిరణ్‌రాథోడ్, గంగకిషన్, శరత్, స్వామి, రాజేశ్, బీఆర్‌నేత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి వీడీసీపై అట్రాసిటీ కేసు

సాక్షి ఎఫెక్ట్..

ఖలీల్‌వాడి: జక్రాన్‌పల్లి గ్రామ కమిటీపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. గత మార్చి 18న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన ఇంటి నిర్మాణంపై తెగని పంచాయితీ అనే కథనంపై అధికారులు స్పందించారు. జక్రాన్‌పల్లి మండల కేంద్రానికి చెందిన సుంకరి స్రవంతి పురాతన ఇల్లు శిథిలావస్థకు చేరింది. దీంతో కొత్త ఇంటి నిర్మాణానికి జీపీ అనుమతులు తీసుకుని ప్రారంభించారు. ఇంటి నిర్మాణం రోడ్డు పైకి వస్తోందంటు వీడీసీ సభ్యులు ఆరోపణలు చేస్తూ ఇంటి నిర్మాణం చేపట్టిన స్లాబును రెండున్నర ఫీట్లను తొలగించి రూ. 30 వేల జరిమానా విధించారు. ఇంటి నిర్మాణాన్ని అడ్డుకోవద్దని వీడీసీ సభ్యులను స్రవంతితోపాటు కుటుంబసభ్యులు వేడుకున్నా వారు పట్టించుకోలేదు. దీంతో ఫ్రిబవరి 27న జక్రాన్‌పల్లి పీఎస్‌లో వీడీసీ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నమోదు చేయాలని బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసినా విచారణ చేపట్టలేదు. కేసు వాపసు తీసుకువాలని వీడీసీ సభ్యులు బాధితులపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురిచేశారు. సంఘ సభ్యులు సైతం వీరిని కుల బహిష్కరణ చేశారు. అంతేకాకుండా ఇంటి నిర్మాణంలో ఇచ్చిన ప్లాన్ ప్రకారం కాకుండా ఎక్కువగా నిర్మాణం చేపట్టారని వీడీసీ సభ్యులు జీపీ సెక్రటరీకి స్రవంతిపై ఫిర్యాదు చేశారు. జీపీ సెక్రటరీ ఆమెకు నోటీసులు ఇచ్చారు. దీంతో బాధితురాలు హైకోర్టు, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. అంతేకాకుండా గత నెల 27న సీపీతో పాటు ఈనెల 1న జిల్లా జడ్జిలకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు గురువారం జక్రాన్‌పల్లి వీడీసీ సభ్యులతోపాటు కుల బహిష్కరణ చేసిన సంఘ సభ్యులపై కేసు నమోదు చేశారు.

భీమ్‌గల్‌లో ఫ్లెక్సీ వివాదం


భీమ్‌గల్‌లో ఆందోళన చేస్తున్న వ్యాపారులు, బీజేపీ నాయకులు

మోర్తాడ్: భీమ్‌గల్ పట్టణంలోని ఓ దుకాణం ఎదుట కట్టిన ఫ్లెక్సీని తొలగించడంతో ఆగ్రహించిన ఒక వర్గానికి చెందిన వ్యక్తి సదరు వ్యాపారిపై దాడికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. ఓ వర్గానికి చెందిన యువకుడు తమ మతం పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ ఫ్లెక్సీని ఇటీవల ఏర్పాటు చేశాడు. ఫ్లెక్సీ ఏర్పాటుతో తమ దుకాణం బయటి వారికి కనిపించకుండా ఉందని సదరు వ్యాపారి ఆ ఫ్లెక్సీని తొలగించాడు. దీంతో కోపంతో వ్యాపారిపై దాడికి పాల్పడ్డారు. వ్యాపారికి మద్దతుగా బీజేపీ నాయకులు, వ్యాపారులు ఆందోళన నిర్వహించారు. తమ వ్యాపారం తాము చేసుకుంటూ ఉంటే దుకాణానికి అడ్డంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం ఎంత వరకు సమంజసమని వ్యాపారులు ప్రశ్నించారు. రోడ్డుపై బైటాయించి ఆందోళన నిర్వహించగా భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ, పోలీసులు ఆందోళనకారులతో చర్చించారు. ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చి వివాదం సద్దుమనిగేలా చేశారు.

కారులో నిద్రిస్తున్న వారిపై దాడి

- ల్యాప్‌టాప్, బ్యాగు అపహరణ
- టేక్రియాల్‌లో రెచ్చిపోయిన దుండగులు


బాధితుడు రాఘవయ్య



కామారెడ్డి క్రైం: రోడ్డు పక్కన కారు నిలిపి విశ్రాంతి తీసుకుంటున్న వారిపై దుండగులు దాడి చేసి దోపిడీకి పాల్పడిన ఘటన కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియాల్‌లో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన వీరరాఘవయ్య కుమారుడు నాగమణిదీప్ హైదరాబాద్‌లో పదో తరగతి చదువుకుంటున్నాడు. పరీక్షలు పూర్తి కావడంతో వీరరాఘవయ్య కుమారుడిని స్వగ్రామానికి కారులో తీసుకొస్తున్నాడు. వీరి వెంట వీరరాఘవయ్య స్నేహితుడైన మరో వ్యక్తి కూడా ఉన్నారు. గురువారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో టేక్రియాల్ వద్ద పెట్రోల్ బంక్ పక్కనే ఉన్న ఓ హోటల్ ఎదుట రోడ్డు పక్కన కారు నిలిపి అందులో నిద్రించారు. ఇది గమనించిన నలుగురు దుండగులు కారు అద్దాలను పగలగొట్టి దాడి చేశారు. కారులోని ఓ బ్యాగు, ల్యాప్‌టాప్‌లను ఎత్తుకెళ్లారు. ఈ దాడిలో వీర రాఘవయ్యకు గాయాలయ్యాయి. దాడి జరిగిన వెంటనే భయంతో రాఘవయ్య కారు స్టార్ట్ చేసి దాదాపు ఆరు కిలోమీటర్ల దూరంలోని సదాశివనగర్ వరకు తీసుకెళ్లారు. అక్కడ కారును నిలిపి డయల్ 100 కు సమాచారం ఇచ్చాడు. ఎస్పీ రాజేశ్ చంద్ర, దేవునిపల్లి పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీవితంపై విరక్తితో మహిళ ఆత్మహత్య


లక్ష్మి మృతదేహం

బీబీపేట: కిడ్నీల సమస్యతో బాధపడుతున్న ఓ మహిళ జీవితంపై విరక్తితో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బీబీపేట ఎస్సై ప్రభాకర్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఇస్సానగర్ గ్రామానికి చెందిన చెవుల లక్ష్మి(60) గత మూడేళ్లుగా కిడ్నీల సమస్యతో బాధపడుతోంది. ఈ నెల 2న తన తల్లిగారింటికి వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లింది. భర్త ఎల్లయ్య గురువారం సాయంత్రం అత్తగారింటికి ఫక్షన్ చేసి ఆరా తీయగా ఇంకా రాలేదని చెప్పారు. దీంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఉదయం పెద్ద చెరువులో మృతదేహం లభ్యమైంది. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్నేహితురాలి మృతి తట్టుకోలేక యువకుడు..

ఖలీల్‌వాడి: స్నేహితురాలి మృతి తట్టుకోలేక ఓ యువకుడు ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన నగరంలోని గాయత్రినగర్‌లో గురువారం చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గాయత్రినగర్‌కు చెందిన పవన్‌రాజు స్థానికంగా ఉండే ఓ షాప్‌లో పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల క్రితం అతని స్నేహితురాలు మృతి చెందింది. దీంతో నాటి నుంచి ఎవరితో మాట్లాడకుండా పనికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి అరుణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త జ్యోతి రావు పూలే



తెయూ: గొప్ప సంఘ సంస్కర్త, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావుపూలే ఉత్సవాలను తెయూలో ఘనంగా నిర్వహించాలని వీసీ టి యాదగిరిరావు తెలిపారు. గురువారం తన చాంబర్‌లో జ్యోతిరావుపూలే జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని తెయూలో 'భారత జాతీయ అభివృద్ధి' అనే అంశంపై ఈ నెల 11న నిర్వహించనున్న ఒక రోజు సదస్సు బ్రోచర్‌ను వీసీ రిజిస్ట్రార్ యాదగిరితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మామిడాల ప్రవీణ్, సీహెచ్ ఆంజనేయులు, సీహెచ్‌ఆరతి, కె సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు చోట్ల ముగ్గురి మృతి

ఉమ్మడి నిజామాబాద్‌లో జిల్లాలో గురువారం వేర్వేరు చోట్ల ముగ్గురు మృతి చెందారు. చేపలు పట్టేందుకు వెళ్లి ఇద్దరు, గోదావరిలో పడి మరొకరు మృతి చెందగా పోలీసులు కేసు నమోదు చేశారు.

నస్రుల్లాబాద్: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీట మునిగి మృతి చెందినట్లు ఎస్సై లావణ్య తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ మండలం కొల్లూరు గ్రామానికి చెందిన జరపాటి అశోక్(19) అనే యువకుడు నస్రుల్లాబాద్ మండలం దుర్కి గ్రామంలో ఉన్న రెడ్డి చెరువులో చేపలు పడుతుండగా బుధవారం ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందాడు. గురువారం చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమచారం అందించారు. మృతుడి అన్న సాయికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలం జాన్కంపల్లి ఖుర్దు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జన్నుల నారాయణ (56) గురువారం సాయంత్రం గ్రామ శివారులోని తాటివాని మత్తడి చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులో ఉన్న వల కాలికి తట్టడంతో నీట మునిగి మృతి చెందాడు. గమనించిన స్థానికులు అతడిని బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

గోదావరిలో పడి కూలీ..

నవీపేట: మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన గోనెవార్ గంగాధర్(49) కాలుజారి గోదావరి నదిలో పడి గురువారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. వ్యవసాయ కూలీ పనులకు వెళ్లిన గంగాధర్ బోరు మోటారు పని చేయకపోవడంతో గోదావరి నది ఒడ్డున ఉన్న మోటారు వద్దకు వెళ్లాడని పేర్కొన్నారు. మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి గోదావరి నదిలో పడి మృతి చెందాడు. భార్య చాయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ..


లక్ష్మి మృతదేహం

ఎడపల్లి: అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందిన ఘటన ఎడపల్లి మండలం జైతాపూర్‌లో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పురిమేటి లక్ష్మి(35) అనే మహిళ ఈ నెల 1న నిజామాబాద్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఆమె కోసం వెతుకుతుండగా గ్రామ సమీపంలోని పంట కాలువలో ఆమె విగతజీవిగా కనిపించింది. మృతురాలి అన్న నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు బోల్తా.. పలువురికి స్వల్ప గాయాలు



ఇందల్వాయి: చంద్రాయన్‌పల్లి శివారులో గురువారం ఉదయం కారు బోల్తా పడ్డ ఘటనలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. టోల్‌ప్లాజా సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కి చెందిన ప్రహసంద రామేశ్వరి దంపతులు వారి కుమారుడు రఘుతో పాటు పదేళ్ల వయసున్న మనవరాలితో కలిసి కారులో బాసరకు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు గుర్తించి టోల్‌ప్లాజా సిబ్బందికి సమాచారం అందించారు. వారిని టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో నిజామాబాద్‌కి తరలించారు. ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలు కాగా చిన్న పాప కాలుకి తీవ్ర గాయమైనట్లు తెలిపారు.

బాలుడి అదృశ్యం


సంతోష్

ఖలీల్‌వాడి: నగరంలోని బోధన్ బస్టాండ్ ప్రాంతంలో బాలుడు అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి గురువారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. కోటగిరికి చెందిన వాగ్మారి పూజ తన పన్నెండేళ్ల కుమారుడు సంతోష్‌ను తీసుకొని మార్చి 31న జిల్లా కేంద్రంలోని బోధన్ బస్టాండ్ ప్రాంతంలో ఉంటున్న అత్తామామల వద్దకు వచ్చింది. అదే రోజు సాయంత్రం బాలుడు బయటకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. బాలుడి ఆచూకీ తెలిసిన వారు 87126 59714, 94410 58289 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

కలప ట్రాక్టర్ పట్టివేత

రుద్రూర్: మండల కేంద్రంలో అనుమతి లేకుండా కలప రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను అటవీశాఖ సిబ్బంది బుధవారం రాత్రి పట్టుకున్నారు. కలపను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో అటవీ శాఖ సెక్షన్ అధికారి చంద్రప్రకాశ్ ఆధ్వర్యంలో ట్రాక్టర్‌ను పట్టుకుని వర్ని అటవీశాఖ కార్యాలయానికి తరలించారు.

ఇసుక టిప్పర్లు..

నిజామాబాద్ రూరల్: రూరల్ పీఎస్ పరిధిలోని బైపాస్ రోడ్డు వద్ద అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేసినట్లు రూరల్-2 ఎస్సై ఆనంద్‌సాగర్ తెలిపారు. సాలూర నుంచి బైపాస్ గుండా అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఫతేపూర్ శివారులో..

ఆర్మూర్‌టౌన్: మండలంలోని ఫతేపూర్ శివారులోని చెరువు నుంచి అనుమతి లేకుండా మొరం తరలిస్తున్న జేసీబీ, ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు. ఆర్మూర్ మండల ఆర్‌ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం ..

ఖలీల్‌వాడి: నగరంలోని అశోక్‌నగర్, ఎరుకలవాడలో ఉన్న పీడీఎస్ రైస్ గోదాంపై దాడి చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య గురువారం తెలిపారు. ఈ దాడిలో పది టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వీటి విలువ సుమారు రూ. నాలుగు లక్షల వరకు ఉంటుందని అన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు

మోపాల్: మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన వాహన తనిఖీల్లో బోర్గాం(పి) గ్రామానికి చెందిన వ్యక్తిపై డ్రంకన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ గురువారం తెలిపారు. అలాగే సరైన ధ్రువపత్రాలు లేని 30 వాహనాలకు జరిమానాలు విధించినట్లు ఆయన పేర్కొన్నారు.

మాదాపూర్‌లో చోరీ

మాక్లూర్: మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన గొల్లదేవానంద ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దేవానంద తన భార్యతో ఉదయం ఉపాధిహామీ పనుల కోసం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి వచ్చే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో ఉన్న ఆరు తులాల బంగారం, రూ. ఐదు వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే జైలుకే

ఖలీల్‌వాడి: మైనర్లకు వాహనాలు ఇస్తే యజమాని జైలుకు వెళ్లడం ఖాయమని ట్రాఫిక్ ఏసీపీ నారాయణ గురువారం తెలిపారు. విధుల్లో ఉన్న ట్రాఫిక్ పోలీసులకు మైనర్లు వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి వారిని పట్టుకున్నారు. కుటుంబ సభ్యులను పీఎస్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనాల యజమానులకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో ఐదుగురికి జైలు

మద్యం సేవించి వాహనాలు నడిపిన 15 మందిని పట్టుకున్నట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. వీరికి కౌన్సెలింగ్ ఇచ్చి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు. ఇందులో 10 మందికి రూ.14,500 జరిమానా విధించగా ఐదుగురికి రెండు రోజుల జైలును శిక్షను జడ్జి విధించినట్లు చెప్పారు. ప్రజలు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలని కోరారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



కామారెడ్డి క్రైం: అదుపు తప్పిన ఓ కారు బోల్తా పడిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. టేక్రియాల్ నుంచి కామారెడ్డి వైపు వస్తున్న ఓ కారు జిల్లా కేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియం ప్రాంతంలోకి రాగానే అదుపు తప్పి పల్టీ కొట్టింది. బెలూన్లు తెరుచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడని స్థానికులు తెలిపారు. పెను ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.